క్లుప్తంగా

కాలభైరవుడికి ప్రత్యేక పూజలు



నందిగామ: నియోజకవర్గ పరిధిలోని పలు ఆలయాల్లో కాలభైరవుడికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అష్టమి తిథి రోజున కాలభైరవుడిని పూజిస్తే కష్టాలు తొలుగుతాయని ప్రజల నమ్మకం. ఈ నేపథ్యంలో అష్టమి ఆదివారం కలిసి రావడంతో విశేష పూజలు చేశారు. పట్టణంలోని రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో గల కాలభైరవ ఉపాలయంలో స్వామివారికి పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేపట్టారు. మండలంలోని సోమవరం, అంబారుపేట గ్రామాల్లోని శివాలయాల్లో గల కాలభైరవుడి ఉపాలయాల్లో విశేష పూజలు చేశారు. ఆయా ఆలయాల్లో జరిగిన పూజా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు పొక్కునూరులో కంటి వైద్యశిబిరం

నందిగామ(చందర్లపాడు): గుర్రం జాషువా కళా పీఠం ఆధ్వర్యంలో మండలంలోని పొక్కునూరు గ్రామంలో సోమవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు దొండపాటి సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని డీవీఆర్ కాలనీలో గల కమ్యూనిటీ హాల్ వద్ద ఉదయం 10 గంటలకు వైద్యశిబిరం ప్రారంభమవుతుందన్నారు. శిబిరంలో ప్రత్యేక కంటి వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

16న మెగా వైద్యశిబిరం

నందిగామ: నందిగామ పట్టణంలో ఈనెల 16వ తేదీ శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వాయిస్ ఆఫ్ గాడ్ మినిస్ట్రీస్ చైర్మన్ జీవీ ప్రసాదరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పట్టణ శివారులోని సీయోను ప్రార్థనా మందిర ఆవరణలో వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు. ఈ శిబిరంలో ఛాతి, గర్భాశయ పరీక్షలు, ఎక్స్ రే, నోటి పరీక్షలు, బి.పి., సుగర్ పరీక్షలు నిర్వహించడంతో పాటు అన్ని రకాల వ్యాధులకు చెందిన ప్రత్యేక వైద్య నిపుణులు ఈ శిబిరంలో వైద్య సేవలందిస్తారన్నారు. నందిగామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పిడుగుపాటుకు పాడి గేదె మృతి

చెవిటికల్లు(కంచికచర్ల): మండలంలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురువటంతో పిడుగుపాటుకు ఓ పాడిగేదె మృతి చెందిన సంఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు మండలంలోని చెవిటికల్లు గ్రామానికి షేక్ ఖాజా అనే రైతుకు చెందిన పాలిచ్చే గేదెపై శనివారం రాత్రి పిడుగుపడటంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయి మృతి చెందింది. గేదె ఖరీదు రూ.80 వేలు ఉంటుందని సొసైటీ అధ్యక్షుడు మంగిశెట్టి పుల్లారావు తెలిపారు.

మధురంగా సాగిన గాత్ర కచేరీలు



విజయవాడ కల్చరల్: హరిద్ర మ్యూజిక్ అకాడమీ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో ఆదివారం నిర్వహించిన గాత్ర కచేరీలు మధురంగా సాగాయి. ఉదయం 9 గంటలకు హరిద్ర, రిషిత కచేరీతో వార్షికోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. సీనియర్ సంగీత కళాకారులు గాయత్రి, లలిత, సౌమ్య, సీహెచ్ పద్మ, అంజన,విష్ణుప్రియలతో పాటు హరిద్ర సంగీత శిక్షణా కేంద్రానికి చెందిన 50 మందికి పైగా చిన్నారులు అన్నమయ్య, రామదాసు, త్యాగరాజ స్వామి రచించిన సంకీర్తనలను గానం చేశారు. కార్యక్రమాలను ప్రారంభించిన సంస్థ వ్యవస్థాపకుడు కె.సుబ్రహ్మమణ్యరాజు తమ లక్ష్యాలను వివరించారు. సంగీత కళాశాల విశ్రాంత గాత్ర విభాగం అధ్యాపకుడు ఎస్‌సీహెచ్ బుచ్చయ్యాచార్యులు, చిన్నారులను ఆశీర్వదిస్తూ ప్రసంగించారు. నగరానికి చెందిన సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్, పోపూరి గౌరీనాథ్ పాల్గొన్నారు. గుంటూరు సంగీత కళాశాల పూర్వపు అధ్యాపకురాలు పాటిబండ్ల జానకిని నిర్వాహకులు సత్కరించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):ప్రజల ప్రశాంత జీవనానికి ఆటంకం కలిగించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లపై నిరంతరం నిఘా కొనసాగుతుందని కొత్తపేట సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషటర్లు, సస్పెక్ట్ షీటర్లకు ఆదివారం స్టేషన్ ఆవరణలో కౌన్సెలింగ్ ఇచ్చారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. క్రమం తప్పకుండా పోలీస్ స్టేషన్ వచ్చి కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని చెప్పారు. రౌడీషీటర్లపై ఫిర్యాదులొస్తే నగర బహిష్కరణకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. సంఘ వ్యతిరేక కార్యకలాపాలపై పోలీసులకు కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో సెక్టార్ ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

- మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్
- ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరాలు



పేటలో బహుమతులు అందుకున్న విద్యార్థులతో మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్ తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: నేటి ఆధునిక దేవాలయాలుగా పిలువబడుతున్న గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ తెలిపారు. స్థానిక జిల్లా గ్రేడ్-1 స్థాయి గ్రంథాలయంలో జరిగిన వేసవి విజ్ఞాన శిబిరం 34 రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 34 రోజుల శిక్షణలో విద్యార్థులు మంచి విషయాలు నేర్చుకున్నారని, విన్నదాని కంటే దృశ్య రూపంలో చూసింది బాగా గుర్తుంచుకుంటారని తెలిపారు. వేసవి సెలవుల్లో తమ విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా విజ్ఞాన శిబిరానికి వచ్చి అనేక కొత్త విషయాలను తెలుసుకోవడం సంతోషకరమన్నారు. ఇలాంటి శిబిరాలను పెట్టిన ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలంటే విద్యార్థుల బాగా చదువుకోవాలని సూచించారు. గ్రంథాలయాధికారి అలేటి ప్రభ మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరంలో తమ సమయాన్ని వెచ్చించి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులకు, సహకరించిన పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం శిక్షణ శిబిరంలో వివిధ పోటీల్లోని విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో 5వ వార్డు కౌన్సిలర్ వట్టెం మనోహర్, ఉపాధ్యాయులు దోసపాటి నాగేశ్వరరావు, టి.వినోద్‌కుమార్, గ్రంథాలయ సిబ్బంది రమేష్, శ్యామల, సత్యవతి, బీడీసీ మల్లిక పాల్గొన్నారు.

విద్యార్థులకు విజ్ఞానం



నందిగామలో మాట్లాడుతున్న ఎంఈవో బాలాజీ

నందిగామ: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని అటువంటి గ్రంథాలయాల్లో విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించడం వలన ఎన్నో ప్రయోజనాలున్నాయని ఎంఈవో బి.బాలాజీ పేర్కొన్నారు. పట్టణంలోని గ్రంథాలయంలో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఈ నేపథ్యంలో చివరి రోజు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈవో మాట్లాడుతూ వేసవిలో గ్రంథాలయాల్లో విద్యార్థులకు నిర్వహించిన ప్రత్యేక విజ్ఞాన శిక్షణ శిబిరాలతో బహుళ ప్రయోజనాలున్నాయన్నారు. ప్రతి విద్యార్థికి గ్రంథాలయం ప్రత్యేకత తెలియడంతో పాటు గ్రంథాలయాల్లోని విలువైన పుస్తకాల విలువ కూడా తెలుస్తోందని చెప్పారు. సమ్మర్ క్యాంప్ విద్యార్థులకు విజ్ఞానంతో పాటు వినోదాన్ని పంచిందన్నారు. అనంతరం పలు పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రత్యేక ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి షేక్ మస్తాన్ వలి, పలువురు అతిథులు పాల్గొన్నారు.



కంచికచర్లలో బహుమతులు అందజేస్తున్న రామచంద్రుడు

నైతిక విలువలు పెంపొందించుకోవాలి..

పెనుగంచిప్రోలు: విద్యార్థులు నైతిక విలువలు పెంపొందించుకోవాలని పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు గ్రంథాలయాధికారులు ఇంజం మధు, మధుబాబులు అన్నారు. వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా ఆదివారం విద్యార్థులచే కథలు చదివించటం, నీతి వాక్యాలు చెప్పించటంతో పాటు కార్టూన్లు, గ్రంథ పఠనం వలన కలిగే లాభాలను వివరించారు. నీతి కథల పుస్తకాలు చదవటం, వినటం వలన నైతిక విలువలు పెంపొందుతాయన్నారు. అలాగే పలు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.



అనిగండ్లపాడులో బహుమతులతో విద్యార్థులు

బహుమతుల అందజేత

కంచికచర్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరాలు ఆదివారంతో ముగిశాయని శాఖా గ్రంథాలయ గ్రంథ పాలకుడు అల్లూరు రామచంద్రుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వేసవి శిక్షణా శిబిరాలు 35 రోజుల పాటు నిర్విరామంగా స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు, ఉద్యోగుల సహకారంతో నిర్వహించామన్నారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో కె.బాలశంకరరావు విచ్చేశారు. వేసవి శిక్షణా శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకున్నందుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం పలు పోటీ విభాగాల్లో పాల్గొన్న విద్యార్థులకు రామచంద్రుడు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయుడు షేక్ ఇస్మాయిల్, నీలం సర్వేశ్వరరావు, ఎం.కనకారావు, జిల్లేపల్లి బుజ్జి పాల్గొన్నారు.

మహిళల రక్షణకు దిశ యాప్ వజ్రాయుధం

ఏసీపీ జనార్దననాయుడు



దిశ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఏసీపీ జనార్దననాయుడు, సీఐ, ఎస్‌ఐలు

జగ్గయ్యపేటఅర్బన్: ప్రభుత్వం మహిళల రక్షణ కోసం ఏర్పాటుచేసిన దిశ యాప్ మహిళలకు వజ్రాయుధం లాంటిదని ఏసీపీ జనార్ధననాయుడు అన్నారు. ఆదివారం రాత్రి జగ్గయ్యపేట పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం కూడలిని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా దిశ యాప్ డౌన్‌లోడ్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పలువురు మహిళల చేత దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి యాప్‌పై వారికి అవగాహన కల్పించారు. ఏసీపీ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల రక్షణ కోసం ఈ దిశ యాప్‌ను దేశంలో ఎక్కడా లేని విధంగా అమలులోకి తీసుకువచ్చిందన్నారు. ప్రతి మహిళ మొబైల్ ఫోన్‌లో ఉండాలన్న లక్ష్యంతో డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యాప్‌ను ప్రతి మహిళ డౌన్‌లోడ్ చేసుకోని, సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేట సీఐ జానకీరామ్, ఎస్‌ఐ బీవీ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆర్డీవో కార్యాలయంలో 'స్పందన'

నందిగామ: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని ఆర్డీఓ రవీంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. డివిజన్ పరిధిలోని మండలాల ప్రజలు తమ సమస్యలను స్పందన కార్యక్రమంలో తెలియజేసి పరిష్కారం పొందాలని కోరారు.

వాహనదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

జుజ్జూరు(వీరులపాడు): నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ మహాలక్ష్మణుడు హెచ్చరించారు. మండలంలోని జుజ్జూరు గ్రామ శివారులో ఆదివారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు విధిగా నిబంధనలు పాటించాలని నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.
వాహనాలకు సంబంధించిన అన్ని రికార్డులు విధిగా వెంట ఉంచుకోవాలని తెలిపారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు పరిమిత సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించాలని లేకుంటే వాహనాన్ని సీజ్ చేయటంతో పాటు కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

రాజీనామాను ఉపసంహరించుకున్న మక్కపేట సర్పంచ్



రాజీనామా ఉపసంహరణ లేఖను విప్ ఉదయభానుకు అందజేస్తున్న శారమ్మ

జగ్గయ్యపేట అర్బన్: వత్సవాయి మండలం, మక్కపేట గ్రామ సర్పంచ్ గుడేటి శారమ్మ తన రాజీనామాను ఉపసంహరించుకున్నారు. ఇటీవల గ్రామంలో జరిగిన కార్యక్రమాలకు సంబంధించి జరిగిన కొన్ని అనివార్య కారణాలతో మనస్తాపానికి గురైన ఆమె రాజీనామా చేసినట్లు ప్రకటించారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఆదివారం తన నివాసంలో సర్పంచ్ గుడేటి శారమ్మతో చర్చించారు. ఆమె మనస్తాపానికి గురి కావడానికి దారితీసిన పరిస్థితులు మరలా పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో ఆమె తన రాజీనామాను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు కనగాల రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కూలీలకు వరంగా ఉపాధి పనులు

- మండలంలో 22 గ్రామ పంచాయతీల్లో పనుల నిర్వహణ
- ప్రతి రోజు 5,800 మంది కూలీలకు ఉపాధి



వీరులపాడు మండలంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

వీరులపాడు: వేసవిలో పనులు లేక కూలీల వలసలను అరికట్టేందుకు ప్రభుత్వం చేపట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు వరంగా మారింది. కూలీలకు ఉపాధి హామీ పథకం ఉపాధి కల్పిస్తోంది. జాబు కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి పని కల్పించటంతో పాటు చేసిన పనికి డబ్బులు కూడా వెంటనే వస్తుండటంతో పనులకు వచ్చేందుకు కూలీలు ఆసక్తి చూపుతున్నారు. రోజుకు రూ.250 నుంచి 260 వరకు వస్తుండటంతో కుటుంబ పోషణకు ఇబ్బంది లేకుండా పోతుందని పలువురు కూలీలు పేర్కొన్నారు.

ముమ్మరంగా పనులు

మండలంలోని 22 గ్రామ పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ పథకం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలో 5,800ల మందికి పైగా కూలీలు పనులకు వస్తున్నారని ఉపాధి హామీ పథకం అధికారులు చెబుతున్నారు. అంతే కాకుండా వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతుండటంతో పంట కాల్వల ఆధునీకరణ, రోడ్లు, చెరువుల అభివృద్ధి పనులు నిర్వహిస్తుండటంతో ఆయా గ్రామాల రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2023-24 ఆర్థిక ఏడాదికి గాను కూలీలకు 5 లక్షల పని దినాలు కల్పించాల్సి ఉండగా మార్చి వరకు 2.60 లక్షల పని దినాలు కల్పించినట్లు అధికారులు చెబుతున్నారు.

జీవనం సాగుతుంది..



వేసవిలో వ్యవసాయ పనులు ఉండకపోవటంతో ప్రతి ఏటా కుటుంబ వేసవిలో కుటుంబ పోషణ భారంగా ఉండేది. ఉపాధి పనులు చేపడుతుండటంతో ఏ ఇబ్బంది లేకుండా జీవనం సజావుగా సాగుతుంది.

– సుభాషిణి, ఉపాధి కూలీ

సకాలంలో వేతనాలు ఇస్తున్నారు



గతంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వేతనాలు సక్రమంగా వచ్చేవి కావు. కానీ గత రెండు, మూడేళ్ల నుంచి సకాలంలో అందిస్తున్నారు. చేసిన పనికి కూడా తగిన కూలీ ఇస్తున్నారు. రోజుకు రూ.250ల వరకు వస్తుంది.

– దుర్గామల్లేశ్వరి, ఉపాధి కూలీ

కూలీల రక్షణకు చర్యలు..



మండలంలోని 22 గ్రామ పంచాయతీల పరిధిలో ఉపాధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలో 5,800 మంది కూలీలు పనులకు వస్తున్నారు. కూలీల రక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– జనార్దన్, ఏపీఎం

2024 ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి

ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఉదయభాను, వేదికపై ప్రజాప్రతినిధులు

జగ్గయ్యపేటఅర్బన్: 2024వ సంవత్సరంలో జరిగే అసెంబ్లీ ఎన్నికలను వైఎస్సార్ సీపీకి అత్యంత ప్రతిష్టాత్మకమని, ఈ ఎన్నికల్లో పార్టీ సోషల్ మీడియా విభాగం ముఖ్య భూమిక పోషించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. స్థానిక శ్రీమతి గెంటేల శకుంతలమ్మ(ఎస్‌జీఎస్) కళాశాల ఆడిటోరియంలో ఆదివారం ఏర్పాటు చేసిన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉదయభాను మాట్లాడుతూ.. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన దేశంలోనే చరిత్ర సృష్టిస్తోందన్నారు. మన రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి అనేక రాష్ట్రాలు ఏపీ వైపు చూస్తున్నాయన్నారు. వ్యవసాయం, విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలు తీసుకువస్తుండటం చూసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయని చెప్పారు. సోషల్ మీడియా కార్యకర్తలకు, కన్వీనర్లను పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. సైనికుల్లా కష్టపడి పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు రంగాపురం రాఘవేంద్ర, తుమ్మల ప్రభాకర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, పట్టణ యూత్ అధ్యక్షుడు ఆవాల భవానీ ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు మండవ శ్రీనివాసగౌడ్, కౌన్సిలర్లు, సచివాలయాల కన్వీనర్లు, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ నారెడ్ల కిషోర్, సోషల్ మీడియా గ్రామ, మండలాల కన్వీనర్లు పాల్గొన్నారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న దాతలు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావటంతో పాటు పలు శుభకార్యాలు ఉండటం, వేసవి సెలవులు ముగుస్తుండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. దీంతో గ్రామం జనసంద్రంగా మారింది. భక్తుల రద్దీతో ఆలయంలో క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువ జాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. వేలాది వాహనాలు తరలిరావటంతో ఆదివారం పెనుగంచిప్రోలు పుణ్యక్షేత్రం పెద్ద నగరాన్ని తలపించింది. తెలుగు రాష్ట్రాల నుంచి వందలాది వాహనాల్లో భక్తులు తరలివచ్చారు. తెల్లవారు జాము నుంచి సాయంత్రం వరకు వాహనాల రద్దీ కొనసాగింది. భక్తులు మధ్యాహ్న సమయంతో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు. తెలంగాణా రాష్ట్రం, సూర్యాపేటకు చెందిన భక్తులు విజయ్, సావిత్రి, విజయవాడకు చెందిన ఐ.దుర్గాప్రసాద్ సౌజన్యంతో మజ్జిగ పంపిణీ చేశారు.

తిరుపతమ్మ ఆలయానికి రూ.20 వేల విరాళం



ఆలయ ఈఓ, చైర్మన్‌కు విరాళం అందజేస్తున్న దాత ఏడుకొండలు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయానికి ఆదివారం ప్రకాశం జిల్లా, మార్టూరు మండలం, వలపర్ల గ్రామానికి చెందిన ఆవల ఏడుకొండలు, అంకమ్మ దంపతులు రూ.20 వేలు విరాళాన్ని ఆలయ ఈఓ కె.రమేష్‌నాయుడు, చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు చేతుల మీదుగా అందజేశారు. నగదును అమ్మవారి గోశాలలో గోవుల సంరక్షణకు వినియోగించాలని దాతలు కోరారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించి, తీర్థప్రసాదాలను అందజేశారు.

జగన్ సుపరిపాలనతో వైఎస్సార్ సీపీలో చేరికలు




పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, నాయకులు

నందిగామటౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాలుగేళ్లుగా అందిస్తున్న సంక్షేమ పథకాలు, సుపరిపాలనతో ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్ల ఆకర్షితులవుతున్నారని నందిగామ శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని కమ్మవారిపాలెం గ్రామానికి చెందిన పలు కుటుంబాలు పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో శనివారం రాత్రి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే జగన్‌మోహనరావు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానిస్తున్నారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం, అభివృద్ధి పరమావధిగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ప్రతి ఒక్కరూ ఆకర్షితులవుతున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీలోకి మరిన్ని చేరికలుంటాయన్నారు.

గడప గడపలో అపూర్వ ఆదరణ

చంద్రబాబును ప్రజలు నమ్మే స్థితిలో లేరని ప్రజలంతా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పక్షానే ఉన్నారని ఎమ్మెల్యే జగన్‌మోహనరావు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్తున్న తమకు అపూర్వ ఆదరణ లభిస్తుందన్నారు. ప్రజా ఆశీస్సులు మెండుగా ఉన్నాయని రానున్న ఎన్నికల్లో సైతం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో విజయం సాధిస్తుందని చెప్పారు. నాయకులు షేక్ సైదా, షేక్ కరిముల్లా, గుడివాడ సాంబశివరావు, యాకుబ్ అలీ, విశ్వనాథపల్లి కృపారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే మైనార్టీలకు న్యాయం



గౌరవరంలో మత పెద్దలతో మాట్లాడుతున్న వక్ఫ్‌బోర్డు చైర్మన్ గౌస్ మొహిద్దీన్

గౌరవరం(జగ్గయ్యపేట): వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే మైనార్టీలకు న్యాయం జరిగిందని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్ పేర్కొన్నారు. హర్ దిల్ మే వైఎస్సార్, హమ్ జగన్ కే సాత్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని నూర్ మసీదు వద్ద స్థానిక ముస్లింలతో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాలుగేళ్ల పాలనలో మైనార్టీల సంక్షేమానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేశారన్నారు. అంతే కాకుండా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, నామినేటెడ్ పదవుల్లో కూడా ముస్లింలకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు రాజ్యాధికారాన్ని కట్టబెట్టి సంక్షేమానికి కృషి చేస్తున్నారని తెలిపారు.
గత ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీలను ఓటు బ్యాంకుగానే వాడుకున్నారని ఆయన గుర్తు చేశారు. అంతే కాకుండా ఎన్ఆర్సీని వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి మైనార్టీల పక్షపాతిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారన్నారు. నియోజకవర్గంలో ముస్లింలంతా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలని కోరారు. అనంతరం ముస్లింలు గౌస్ మొహిద్దీన్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు కార్యదర్శి ఎండీ జుబేర్, పీఏసీఎస్ చైర్మన్ బాల సైదా, ముస్లిం నాయకులు రఫీ, మహ్మద్, సుభానీ, సయ్యద్ బడేమియా, పఠాన్ అహ్మద్ పాల్గొన్నారు.